ESHAGNA
ఛానల్‌కి సంబంధించిన Pvt Ltd ( Broadcasting ), MSME , Trademark , Food License (Fssai) , ISI License , RNI , Trust (12A-80G), రిజిస్ట్రేషన్ చేయబడును
RTMP సర్వర్ KEY, E పేపర్ వెబ్సైట్, న్యూస్ వెబ్సైట్ చేయబడును.

Registered No : APTEL/25/A1201

# గాయత్రి వార్తలు

జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
గాయత్రి వార్తలు జాతీయ తెలుగు దినపత్రికలో ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాలలో పనిచేయుటకు ఆసక్తి గల విలేకరులు కావలెను. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
యం. నాగేశ్వర రావు
ఎడిటర్ గాయత్రి వార్తలు
సెల్ : 73860 45673

PUBLISHED FROM : DELHI - MAHARASHTRA - ANDHRA PRADESH - TELANGANA - KARNATAKA - TAMILANADU - GOA - LOCKNOW - EDITOR : M. NAGESWARARAO

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ మంగళవారం 31-03-2026 సంపుటి : 1 సంచిక :283 ఎడిటర్ : యం నాగేశ్వరరావు పేజీలు : 4 వెల రు : 2/-

# కేరళ అప్పు

## రూ.5లక్షల కోట్లు దాటింది - ప్రధాని మోదీ

జాతీయ స్థాయిలో కలిసి పనిచేసే ఈ రెండు కూటములు, రాష్ట్రంలో మాత్రం ప్రత్యర్థులుగా నటిస్తూ దశాబ్దాలుగా ప్రజలను మోసం చేస్తున్నాయని మండిపడ్డారు.

- అప్పుల ఊబిలో కేరళ: రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం చిన్నాభిన్నం చేసిందని, కేరళ అప్పులు రూ. 5 లక్షల కోట్లు దాటాయని ప్రధాని విమర్శించారు.
- జీతాల చెల్లింపు కష్టం: రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే, ప్రభుత్వ ఉద్యోగులకు సమయానికి జీతాలు కూడా ఇవ్వలేని స్థితికి చేరుకుందని ఆరోపించారు.
- మార్పు కోరుకుంటున్న ప్రజలు: కేరళలో ఈసారి మార్పు స్పష్టంగా కనిపిస్తోందని, ప్రజలు ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ కూటములకు స్వస్తి పలకాలని నిర్ణయించుకున్నారని పేర్కొన్నారు.



కేరళ ప్రజలు అధికార మార్పు కోరుకుంటున్నారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. రాష్ట్రంలో భిన్నమైన వాతావరణం ఉందని, మార్పు సందేశం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పాలక్కడ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ కూటముల తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. దశాబ్దాలుగా ఈ రెండు కూటములు రాష్ట్రాన్ని దోచుకున్నాయని ఆరోపించారు. వీరి వాగ్దానాలను రాష్ట్ర ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. పేజి 2లో ▶

# లక్ష్యం లేని యుద్ధమా..

## నెలరోజుల పోరులో ట్రంప్ సాధించిందేమిటి..?



ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ చేపట్టిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' ప్రారంభమై నెల రోజులు గడిచింది. యుద్ధం ప్రారంభానికి ముందు ఇరాన్‌లో నాయకత్వ మార్పే లక్ష్యమన్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడారు. ఒకట్రెండు వారాల్లో ఈ ఆపరేషన్ ముగుస్తుందన్నట్లు సంకేతాలిచ్చారు. పోరు ప్రారంభమైన తర్వాత ఆయన తీరు మారింది. ఓసారి యుద్ధం ముగిస్తామని, మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడతామని.. ఇలా పొంతన లేని ప్రకటనలు ఆయన నోటి నుంచి వెలువడ్డాయి. వెలువడుతూనే ఉన్నాయి. యుద్ధానికి వెళుతున్నప్పుడు లక్ష్యం స్పష్టంగా ఉండాలి. నెల రోజుల యుద్ధ గమనాన్ని పరిశీలిస్తే,

పేజి 2లో ▶

## ఇంధన సంక్షోభం వేళ.. శ్రీలంకకు భారత్ సాయం



పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం నెలకొంది. ఈ క్రమంలో భారత్ తన ఉదారతను చాటుకుంది. చమురు కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న శ్రీలంక కు 38వేల మెట్రిక్ టన్నుల పెట్రోలియంను అత్యవసర సహాయం కింద ఆ దేశానికి సరఫరా చేసింది. పేజి 2లో ▶

# కార్యకర్తల త్యాగాలను.. జీవితాంతం గుర్తుపెట్టుకోవాలి

- ఇకపై వారికి ఉచిత వైద్య పరీక్షలు
- జగన్‌రెడ్డికి క్రెడిట్ చోరీ డిజార్డర్
- తెదేపా ఆవిర్భావ దినోత్సవంలో మంత్రి లోకేశ్



తెదేపా అధికారంలోకి రావడానికి ప్రధాన కారణం కార్యకర్తల త్యాగాలని, వారిని జీవితాంతం గుర్తుపెట్టుకోవాలని మంత్రి లోకేశ్ పిలుపునిచ్చారు. ఇక నుంచి క్లస్టర్, యూనిట్, బూత్, జాతీయ, రాష్ట్ర, మండల, డివిజన్, గ్రామ కమిటీల్లో ఉన్నవారందరికీ ఉచితంగా పరీక్షలు చేయించి.. వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించే ఏర్పాటు (ఫాలోఅప్ కేర్) చేస్తామని చెప్పారు. కార్యకర్తలు కొందరు అలకలు వీడాలని.. కార్యకర్తలు అలిగితే రాష్ట్ర ప్రజలు నష్టపోతారని అన్నారు. 'మై టీడీపీ' యాప్‌లో సీబీఎన్ కనెక్ట్ ఆప్షన్ ద్వారా ఎవరైనా తమ అభిప్రాయాలను ముఖ్యమంత్రికి తెలపొచ్చని సూచించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో లోకేశ్ ప్రసంగించారు.

# కార్యకర్తే అధినేత

- సమర్థంగా పనిచేస్తే.. ప్రజాప్రతినిధులు మీరే
- పునర్విభజనతో 50% సీట్లు పెరుగుతున్నాయి.. మహిళలకు 33% రిజర్వేషన్
- కార్యకర్తలను పట్టించుకోని నాయకులు మాకు అవసరం లేదు
- తెదేపా 44వ ఆవిర్భావ దినోత్సవ సభలో పార్టీ అధినేత చంద్రబాబు



మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పార్టీ ఆవిర్భావ వేడుకలో ఎన్టీఆర్‌కు నివాళులు అర్పిస్తున్నముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో మన్నవ మోహన్‌కృష్ణ, కంభంపాటి రామ్మోహన్‌రావు, దేవినేని ఉమామహేశ్వరరావు, కొనకళ్ల నారాయణ, పల్లా శ్రీనివాసరావు, నారా లోకేశ్, నాగుల్‌మీరా, బుద్దా వెంకన్న, అశోక్‌బాబు ప్రస్తుత అధికారం కార్యకర్తల త్యాగాల ఫలితమే. కార్యకర్త లేకపోతే తెదేపా లేదు. అందుకే పార్టీలో కార్యకర్తే అధినేత. ఇది కొత్త సంప్రదాయం. దీన్ని ప్రవేశపెట్టిన లోకేశ్‌ని అభినందిస్తున్నా. పార్టీలో కష్టపడినవారికి ఉత్తమ కార్యకర్తగా సర్టిఫికెట్ ఇస్తే సరిపోదు, అన్ని రంగాలలో ఎక్కడికక్కడ అవకాశాలు కల్పించాలి. అదే మిగిలినవారికీ స్ఫూర్తినిస్తుంది.

# మీడియా స్వేచ్ఛతోనే ప్రజాస్వామ్య మనుగడ

'భారత స్వాతంత్ర్య పోరాటంలో జర్నలిజం కీలకపాత్ర పోషించింది. మహాత్మాగాంధీ, బాలగంగాధర్ తిలక్, సుభాష్ చంద్రబోస్ వంటి స్వాతంత్ర్య సమరయోధులు కూడా పత్రికారంగం ద్వారా సేవలందించారు. మీడియా ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభం' అని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.



# అమరావతికి చట్టబద్ధత..

## అమిత్‌షాతో మాట్లాడిన వెంకయ్య నాయుడు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే అంశంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు మాట్లాడారు. ఏపీ అసెంబ్లీ తీర్మానం చేసిన బిల్లును ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే ప్రవేశపెట్టి ఆమోదించాలని కోరారు. 2015 అక్టోబర్ 22న ప్రధాని మోదీ, అప్పటి పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్న తన చేతులమీదుగా రాజధానికి శంకుస్థాపన జరిగిన విషయాన్ని వెంకయ్య గుర్తుచేశారు.

పేజి 2లో ▶



## ఏపీలో పలువురు ఐఏఎస్‌ల బదిలీ




2లో..

# మూలపేట పోర్టుపై

## వైకాపావి పచ్చి అబద్ధాలు: అచ్చెన్నాయుడు




టెక్కలి: శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం మూలపేటలో జరుగుతున్న పోర్టు నిర్మాణంపై వైకాపా పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. సోమవారం వైకాపా నేతలు పోర్టును సందర్శించనున్న నేపథ్యంలో ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కోటబొమ్మాళిలోని ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన పార్టీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. మూలపేట పోర్టు పనులపై ప్రత్యేక వీడియోను విడుదల చేసి, కార్యకర్తలు, పార్టీ శ్రేణులకు అవగాహన కల్పించారు. అప్పట్లో అన్నింటికీ అనుకూలమైన భావనపాడులో పోర్టు నిర్మాణం కోసం తాము అనుమతులు తీసుకొచ్చే సమయంలో ప్రభుత్వం మారిపోయిందని తెలిపారు. పేజి 2లో ▶

# సంపాదకీయం

## ‘మతం’ చిక్కుల్లో జగన్!

పరాభవ నామ సంవత్సరం ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి అనుకూలంగా లేదని వైసీపీ నిర్వహించిన ఉగాది పంచాంగ పఠనం కార్యక్రమంలో సిద్ధాంతి చెప్పారు. సాధారణంగా రాజకీయ పార్టీలు నిర్వహించే పంచాంగ పఠనాల్లో పాల్గొనే సిద్ధాంతులు ఏ రోటి కాడ పాట ఆ రోటి కాడ పాడతారన్న అభిప్రాయం ఉంది. అంటే ఆయా పార్టీలను, వాటి అధినేతలను పొగుడుతూ పంచాంగ పఠనాలు సాగుతూ ఉంటాయి. ఇందుకు భిన్నంగా వైసీపీ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న సిద్ధాంతి మాత్రం జగన్‌రెడ్డికి ఈ ఏడాది గ్రహబలం అనుకూలంగా లేదని చెప్పారు. సదరు సిద్ధాంతి చెప్పిన దాంట్లో నిజం ఎంత ఉందో తెలియదుకానీ, ఆయన చెప్పిన దానికి అనుగుణంగా రెండు పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ రెండు పరిణామాలూ జగన్‌రెడ్డికి రాజకీయంగా అంతో ఇంతో నష్టం కలిగించేవే! మతపరమైన, కుటుంబపరమైన వివాదాలు జగన్‌రెడ్డిని చుట్టుముడుతున్నాయి. ఈ వివాదాల్లోంచి జగన్‌రెడ్డిని బయటపడేసేందుకు ఆయన మద్దతుదారులు తమ వంతు ప్రయత్నాలు మొదలెట్టారు. జగన్‌రెడ్డిలో మచ్చుకైనా కనిపించని గుణాలను ఆయనకు ఆపాదించే దుస్సాహసాలు చేస్తున్నారు. దాతృత్వంలోగానీ, కుటుంబ విలువలను పాటించడంలోగానీ వర్తమాన రాజకీయాలలో జగన్‌రెడ్డికి మరొకరు సాటిరారని ప్రచారం చేస్తున్నారు. దాతృత్వంలో కర్ణుడు కూడా జగన్‌తో సరితూగలేరని చాటిచెప్పే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇంకా నయం, సకల గుణాభిరాముడు ఆ శ్రీరామచంద్రుడు కూడా జగన్ ముందు దిగదుడుపే అని చెప్పే ప్రయత్నం చేయలేదు. అయితే సిద్ధాంతి చెప్పినట్టుగా జగన్‌రెడ్డికి గ్రహస్థితి అనుకూలంగా లేదని భావించేలా ఆయన తల్లి విజయలక్ష్మి తాజాగా ఒక లేఖ విడుదల చేశారు. తాను సంతకం చేసిన సదరు లేఖ ఒరిజినల్ కాదని వైసీపీ వాళ్లు ప్రచారం చేసే అవకాశం ఉన్నందున ఆమె తన లేఖను నోటరీ చేయించారు. ఇదొక అరుదైన సంఘటన! విజయలక్ష్మి విడుదల చేసిన ఆ లేఖలో ఆస్తుల పంపకం గురించి ప్రధానంగా ప్రస్తావించారు. 2009లో రాజశేఖరరెడ్డి మరణించేవరకు తమకు ఉన్న ఆస్తులు అన్నీ కుటుంబ ఆస్తులేనని ఆమె ఆ లేఖలో స్పష్టం చేశారు. ఆస్తుల పంపకం జరగలేదని, మొత్తం ఆస్తులను జగన్, షర్మిల పిల్లలు నలుగురికీ సమానంగా పంచాలన్నది రాజశేఖరరెడ్డి ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు. ఇది వైఎస్ ఆదేశమని కూడా ఆమె చెప్పుకొచ్చారు. ఇదే విషయాన్ని వైసీపీలో ఉన్నప్పుడు విజయసాయిరెడ్డి కూడా చెబుతుండేవారు. ‘ఆస్తులన్నీ జగన్ పేరిట పెడితే ఎలా? షర్మిలకు అన్యాయం జరగకూడదు’ అని రాజశేఖరరెడ్డి తనతో అనేవారని ఆయన చెప్పారు. ‘ముందు ఇలాగే కానివ్వండి--అన్నీ సర్దుకున్నాక జగన్ నుంచి షర్మిలకు గిఫ్ట్‌గా ఆస్తులను బదిలీ చేయిస్తాను’ అని తాను రాజశేఖరరెడ్డికి నచ్చజెప్పానని కూడా విజయసాయిరెడ్డి చెప్పేవారు. అన్నా చెల్లెళ్ల మధ్య కుదిరిన ఎంవోయూ ప్రకారం అందులో పేర్కొన్న ఆస్తులన్నీ షర్మిలకు చెందాలని, నిజానికి ఎంవోయూలో షర్మిలకు పంచిన ఆస్తులు తక్కువేనని, బెంగళూరు సమీపంలోని యలహంకలోని భూమి కూడా షర్మిలకే చెందుతుందని విజయలక్ష్మి తేల్చి చెప్పారు.

ఆస్తుల పంపకం విషయంలో జగన్‌రెడ్డి ఇప్పటివరకు తన మేనల్లుడు, మేనకోడలికి అన్యాయం చేశాడని, ఎప్పటికైనా వారికి న్యాయం చేస్తాడని తల్లిగా ఆశిస్తున్నానని ఆమె తన లేఖలో పేర్కొన్నారు. ‘ఆస్తుల పంపకం జరగనే లేదు. షర్మిలకు ఇచ్చామని చెబుతున్న ఆస్తుల వంటివి జగన్‌రెడ్డి పేరిట కూడా ఉన్నాయి. ఇది ఆస్తి పంపకం కాదు. నిజం ఏమిటో నా దేవుడికి, నా కొడుక్కి కూడా తెలుసు’ అని ఆమె అన్నారు. గోబెల్స్ ప్రచారం చేయడానికి మీరెవరు అని జగన్‌రెడ్డి మద్దతుదారులను ఆమె ప్రశ్నించారు. ‘మీరు ఎంత కాదన్నా దేవుడి న్యాయమే న్యాయం! అసత్యాల ప్రచారం మానుకోవాలని రాజశేఖరరెడ్డి భార్యగా చేతులు జోడించి అడుగుతున్నాను’ అని ఆమె తన లేఖలో పేర్కొన్నారు. కుటుంబ విలువలు, దాతృత్వంలో జగన్‌రెడ్డి తనకు తానే సాటి అయితే ఈ ఆస్తుల వివాదం ఎందుకు ఉత్పన్నం అవుతున్నది అన్న ప్రశ్నకు సమాధానం కావాలి కదా!

**అప్పుల నుంచి ఆస్తులదాకా...**

నిజానికి 2004లో రాజశేఖరరెడ్డి అధికారంలోకి వచ్చే నాటికి ఆ కుటుంబానికి ఇన్ని ఆస్తులు లేవు. “సండూరు పవర్ ప్రాజెక్టుకోసం 5 కోట్ల రూపాయలు కావాలని జగన్‌రెడ్డి అడుగుతున్నాడు-- ఎలా సర్దుబాటు చేయాలో తెలియడం లేదు” అని పార్లమెంటు సమావేశాల సందర్భంగా రాజశేఖరరెడ్డి తన వద్ద చెప్పుకున్నారని రాజంపేట ఎంపీగా ఉండిన సాయిప్రతాప్ ఒక సందర్భంలో చెప్పారు. ఈ సందర్భంగా ఇంకో విషయమూ చెప్పుకోవాలి. 2004లో ఎన్నికలు ముగిసిన తర్వాత రాజశేఖరరెడ్డి ఢిల్లీలో సోనియాగాంధీని కలిశారు. ఆ తర్వాత బొత్స సత్యనారాయణతో మాట్లాడుతూ, ‘ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నేను ముఖ్యమంత్రిని కాలేకపోతే చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకోవలసి వస్తుంది’ అని రాజశేఖరరెడ్డి తన ఆవేదనను వెలిబుచ్చారు. అంటే ఇప్పుడు వివాదంలో ఉన్న ఆస్తులేవీ అప్పుడు లేవు. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాకే ఆ కుటుంబానికి ఆస్తులు కొండల్లా పెరిగాయి. అవే ఆస్తులు ఇప్పుడు కుటుంబంలో చిచ్చు పెడుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాజశేఖరరెడ్డి అవినీతి గురించి చెన్నయ్‌లోని అమెరికా రాయబార కార్యాలయంలో కాన్సులర్‌గా పనిచేసిన డేవిడ్ హాపర్ అమెరికా ప్రభుత్వానికి పంపిన ఈ మెయిల్స్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. అప్పట్లో సంచలనం సృష్టించిన వికీలీక్స్ వల్ల ఈ వ్యవహారం వెలుగుచూసింది. 2007 అక్టోబర్‌లో డేవిడ్ సదరు ఈ మెయిల్స్ పంపారు. నీటిపారుదల, గృహ నిర్మాణ రంగాలలో అవినీతి తారా స్థాయికి చేరిందని, ఈ అవినీతి వల్ల ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలన్న నిర్ణయాలను అమెరికా కంపెనీలు తీసుకోకపోవడం ఉత్తమమని డేవిడ్ స్పష్టం చేశారు. ‘భారతదేశంలో ప్రజలకు అవినీతి అలవాటైపోయింది. రాజకీయ నాయకుల అవినీతిని ప్రజలు పెద్దగా పట్టించుకోవడం లేదు. ప్రభుత్వాల నుంచి తమకు ఉచితాలు అందితే చాలు అనుకొనే స్థితిలో ఉన్నారు. ఉచితాల కారణంగా రాజశేఖరరెడ్డి అవినీతిపై చంద్రబాబు చేస్తున్న ఆరోపణలను ప్రజలు సీరియస్‌గా తీసుకోవడం లేదు.

రాజశేఖరరెడ్డి ఈ విషయాన్ని బలంగా నమ్మడం వల్లనే అవినీతికి హద్దూ అదుపూ లేకుండా పోతున్నది’ అని డేవిడ్ సెప్టెంబర్‌లో పంపిన మరో ఈ--మెయిల్‌లో పేర్కొన్నారు. ఈ విషయాలను తెలుసుకున్న అప్పటి అమెరికా అధ్యక్షుడు బుష్ నిర్ఘాంతపోయారని వికీలీక్స్ పేర్కొంది. రాజశేఖరరెడ్డి హయాంలో జరిగిన అవినీతితో తనకు ఏమి సంబంధం అని జగన్‌రెడ్డి సీబీఐ అధికారులకు ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో ప్రస్తావించడం గమనార్హం! దాదాపు ఇరవై ఏళ్ల క్రితం అమెరికా కాన్సులర్ తన లేఖలో పేర్కొన్నట్టు మన దేశంలో రాజకీయ నాయకుల అవినీతిని ప్రజలు పట్టించుకోవడం లేదు. పట్టించుకొనే పరిస్థితే ఉంటే అవినీతి మార్గాలలో అంతులేని సంపదను పోగేసుకున్న జగన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగలరా? అయితే, ఎప్పటికైనా పాపం పండుతుంది అని అంటారు. ఇప్పుడు అవే అక్రమ ఆస్తుల కోసం కుటుంబ సభ్యులు వీధి పోరాటాలకు, న్యాయ పోరాటాలకు దిగారు.

**ఇవీ జగన్ విలువలు...**

ఇక్కడ రాజశేఖరరెడ్డి గురించి ఒక విషయం చెప్పుకోవాలి. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఒక కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థికి ఫలానా మొత్తాన్ని సమకూర్చవలసిందిగా తన సహచరుడికి చెప్పారు. ఆ సహచరుడు అంత మొత్తమా? అని నోరు వెళ్లబెట్టగా, మనమేమైనా మట్టి పనులు చేసి సంపాదించామా? అని రాజశేఖరరెడ్డి అన్నారట! అంటే, అడ్డదారుల్లో పోగేసుకున్న సొమ్ము విషయంలో రాజశేఖరరెడ్డి ఉదారంగా ఉండేవారన్నమాట! ఈ ఉదారత చెల్లికి ఆస్తుల పంపకం విషయంలో జగన్‌రెడ్డిలో లోపించడమే వివాదానికి కారణం! అవినీతిని ప్రజలు పట్టించుకోవడం లేదన్నది వాస్తవమే అయినా కుటుంబ విలువలు, దాతృత్వం విషయంలో జగన్‌రెడ్డి నైజాన్ని ప్రజలు ఆమోదించడం లేదు. అతనేమిటో తెలిసిపోవడం వల్లనే గత ఎన్నికల్లో పదకొండు సీట్లకే పరిమితం చేశారు. సంక్షేమ పథకాల మాటున అవినీతిని కప్పిపుచ్చుతున్నప్పటికీ కుటుంబంలో తలెత్తిన వివాదాలు మాత్రం జగన్‌రెడ్డికి రాజకీయంగా నష్టం చేశాయి. జగన్‌రెడ్డిలో ఉదార మనస్తత్వం ఉండి ఉంటే వేల కోట్ల సంపదను నేనొక్కడినే ఏం చేసుకుంటాను అని భావించి చెల్లికి పంచి ఇచ్చేవారు. ఇందుకు

## ‘తల్లిదండ్రుల సంరక్షణ’ బిల్లుకు తెలంగాణ శాసనసభ ఆమోదం

కేంద్ర చట్టం కంటే మెరుగ్గా: 2007 నాటి కేంద్ర చట్టం ప్రకారం తల్లిదండ్రులకు నెలకు గరిష్ఠంగా రూ. 10 వేలు మాత్రమే ఇచ్చే వీలుందని, ఆ పరిమితిని అధిగమించి వృద్ధులకు మెరుగైన అండగా నిలవడమే ఈ కొత్త చట్టం లక్ష్యమని తెలిపారు.అందరికీ వర్తింపు: ఈ చట్టం కేవలం ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే కాదు, ప్రజా ప్రతినిధులకు కూడా వర్తిస్తుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## బీఆర్ఎస్ పాలనలో వేసిన మూడు హౌస్ కమిటీలు ఏమయ్యాయి?: భట్టి విక్రమార్క

హైదరాబాద్: శాసనసభలో బీఆర్ఎస్ సభ్యులు వ్యవహరిస్తున్న తీరును డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తప్పుబట్టారు. రాఘవ కన్‌స్ట్రక్షన్ వ్యవహారంపై హౌస్ కమిటీ వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభలో నిరసన కొనసాగిస్తున్న నేపథ్యంలో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సభా సంప్రదాయాలు తెలిసిన కేటీఆర్, హరీశ్‌రావు కూడా దారుణంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మైనింగ్ అక్రమాలపై అడిగిన వెంటనే సీబీసీఐడీ విచారణకు ఆదేశించామన్నారు.

బీఆర్ఎస్ పాలనలో వేసిన మూడు హౌస్ కమిటీల నివేదికలు ఏమయ్యాయని భట్టి విక్రమార్క ప్రశ్నించారు. గతంలో పలువురిని బ్లాక్‌మెయిల్ చేసి బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారన్నారు. ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు చేయడం సరికాదని.. సభ హుందాతనాన్ని కాపాడాలని కోరారు. సభలో ప్రజాసమస్యలపై చర్చ జరగకూడదని రాద్ధాంతం చేస్తున్నారన్నారు. గతంలో ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని భూములు లాక్కున్నారని.. వందలాది ఎకరాలు కబ్జా చేసిన వ్యవహారంపై హౌస్ కమిటీ వేయాలన్నారు.

కౌశిక్‌రెడ్డి తీరుపై కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఆగ్రహం

శాసనసభలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి తీరుపై కాంగ్రెస్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి విషయంలో కౌశిక్‌రెడ్డి ప్రవర్తించిన తీరును వారు తప్పుబట్టారు. కడియం శ్రీహరికి ఆయన క్షమాపణలు చెప్పాలని.. సభ నుంచి సస్పెండ్ చేయాలని మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు.

## బీఆర్ఎస్ నేతల మంత్రాలకు చింతకాయలు రాలవు: సీఎం రేవంత్

దళిత నేత భట్టి విక్రమార్కను కాంగ్రెస్ పార్టీ సీఎల్పీ నేతను చేసిందన్నారు. దళిత నేత ప్రతిపక్ష నేతగా ఉండకూడదని బీఆర్ఎస్ కుట్ర చేసిందని.. ఎమ్మెల్యేలను లాక్కుని ఆ హోదా రాకుండా చేశారని రేవంత్ ఆరోపించారు. శాసనసభలో సీఎం మాట్లాడుతూ బీఆర్ఎస్ వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

“వ్యక్తిగతంగా భట్టి విక్రమార్కను బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు టార్గెట్ చేసి అవమానిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎంతోమంది దళితులకు అవకాశాలు ఇచ్చింది. దళితుడి ముందు కేసీఆర్ చేతులు కట్టుకుని నిలబడాలని గడ్డం ప్రసాద్‌కుమార్‌కు స్పీకర్‌గా అవకాశం కల్పించాం. దళితుడు స్పీకర్‌గా ఉన్నారని శాసనసభకు కేసీఆర్ రావడం లేదు. దళిత మంత్రిని అవమానించేందుకు బీఆర్ఎస్ నేతలు ప్రయత్నించారు.

బంధువుల కంపెనీని అడ్డుపెట్టుకుని మంత్రి పొంగులేటిని బెదిరించేందుకు ప్రయత్నిస్తున్నారు. గత 12 ఏళ్ల మైనింగ్ అక్రమాలపై సీబీసీఐడీ విచారణ చేపడుతుంది. అక్రమాలపై ఆధారాలు ఉంటే బీఆర్ఎస్ నేతలు సీఐడీకి ఇవ్వాలి. మైనింగ్ శాఖలో జరిగిన అక్రమాలను వెలికి తీసేందుకు చిత్తశుద్ధితో ఉన్నాం. హరీశ్‌రావు కారణంగా తాను ఇరుకున పడ్డానని కేటీఆర్ ఆగ్రహంగా ఉన్నారు. బీఆర్ఎస్ నేతల మంత్రాలకు చింతకాయలు రాలవు. ఇక్కడ ఉన్నది రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క. రేవంత్ ముందు బీఆర్ఎస్ నేతల బెదిరింపులు నడవవు” అని రేవంత్ అన్నారు.

## కేరళ అప్పు రూ.5లక్షల కోట్లు దాటింది - ప్రధాని మోదీ

మొదటి పేజీ తరువాయి

“కేరళ దశాబ్దాలుగా స్వార్థ రాజకీయాల మధ్య చిక్కుకుపోయింది. మేం అధికారంలోకి వస్తే అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం. అనేక కుంభకోణాలకు పాల్పడుతూ రెండు కూటములు అధికారాన్ని మార్చుకుంటున్నాయి. కానీ, ఒకరిపై ఒకరు ఏనాడూ చర్యలు తీసుకోలేదు. నిధుల దుర్వినియోగానికి పాల్పడుతూ రాష్ట్రాన్ని దోచుకున్నాయి. అంతేకాదు.. జాతీయ స్థాయిలో ఈ రెండు కూటములు పార్టీలు కలిసి పనిచేస్తాయి. రాష్ట్రంలో మాత్రం ప్రత్యర్థులుగా నటిస్తాయి” అని ప్రధాని మోదీ విమర్శలు గుప్పించారు.

**నారీశక్తికి నీళ్లొదిలిన కేరళ!**

“రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం నాశనం చేసింది. రాష్ట్రం అప్పు రూ.5లక్షల కోట్లు దాటింది. కొన్నేళ్లలోనే విపరీతంగా పెరిగింది. రాష్ట్ర ఉద్యోగులకు సమయానికి జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. ఎన్డీయే అధికారంలోకి వస్తే అవినీతిపరుల నుంచి డబ్బును రికవరీ చేసి రాష్ట్రాభివృద్ధికి ఖర్చు చేస్తాం” అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇదిలాఉంటే, రాష్ట్రంలో ఏప్రిల్ 9న పోలింగ్, మే 4వ తేదీన కౌంటింగ్ జరగనుంది.

## లక్ష్యం లేని యుద్ధమా..

మొదటి పేజీ తరువాయి

ఓ లక్ష్యం లేకుండా ఈ యుద్ధంలోకి అగ్రరాజ్యం దిగిందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.యుద్ధం ప్రారంభంలో మూడు లక్ష్యాలే తమకు ఉన్నాయని పెంటగాన్, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో పేర్కొన్నారు. తర్వాత పలువురు ఉన్నతాధికారులు తమకు నాలుగు యుద్ధ లక్ష్యాలు ఉన్నాయన్నారు. ట్రంప్ వీరందరి కంటే మరో అడుగు ముందుకు వేసి, అమెరికాకు ఐదు యుద్ధ లక్ష్యాలు ఉన్నాయని ఇటీవల ప్రకటించారు. ఇరాన్ క్షిపణి దాడుల సామర్థ్యాన్ని తగ్గించడం, ఆయుధ తయారీ యూనిట్లను ధ్వంసం చేయడం, నౌకా, వాయుసేనలను నిర్వీర్యం చేయడం, అణుకేంద్రాలను ధ్వంసం చేయడం, పశ్చిమాసియాలోని మిత్రదేశాలకు రక్షణ కల్పించడం తమ లక్ష్యాలని ట్రంప్ తెలిపారు. మరి ఈ నెల రోజుల యుద్ధంలో ఎన్నింటిని అమెరికా సాధించిందో పరిశీలిద్దాం.

## తెదేపా.. తరతరాల తెలుగువారి ఆకాంక్షలకు ప్రతిరూపం

మొదటి పేజీ తరువాయి

పేదవారికి కూడు, గూడు, గుడ్డ ఇవ్వాలనే ఆయన సిద్ధాంతాన్ని సదా పాటిస్తున్నామన్నారు. తెదేపా కార్యకర్తల పార్టీ అని అన్నారు. ఆవిర్భావ దినోత్సవం అంటే మన ఇంటి పండుగ అని.. ఈ సందర్భంగా ప్రతి కార్యకర్తకు పేరుపేరునా శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు చంద్రబాబు పేర్కొన్నారు. తెలుగువారి ఆత్మగౌరవం, అభ్యున్నతి కోసం తెదేపా పుట్టిందని పార్టీ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ అన్నారు. సమాజమే దేవాలయం-ప్రజలే దేవుళ్లు అని నినదించిన ఎన్టీఆర్ స్ఫూర్తితో పేద ప్రజలకు అండగా నిలిచిందని తెలిపారు. తెదేపా ఆవిర్భావం తర్వాతే సమాజంలో అణగారిన, బడుగు, బలహీనవర్గాలకు రాజకీయంగా, సామాజికంగా గుర్తింపు వచ్చిందని గుర్తుచేశారు. దేశానికి సంక్షేమాన్ని పరిచయం చేసిన పార్టీ తెదేపా అని పేర్కొన్నారు. ప్రపంచంలో తెలుగువారిని మొదటి స్థానంలో నిలపడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు.

## మూలపేట పోర్టుపై వైకాపావి పచ్చి అబద్ధాలు: అచ్చెన్నాయుడు

మొదటి పేజీ తరువాయి

అంత భూమి సేకరించి పరిహారం ఇవ్వలేక వైకాపా ప్రభుత్వం మూలపేట పోర్టుకు మార్పు చేసి, ఎన్నికలకు ఏడాది ముందు కొబ్బరికాయ కొట్టిందని అన్నారు. తాము అధికారంలోకి వచ్చేసరికి కేవలం 22 శాతం పనులు మాత్రమే జరిగాయని, ఇప్పుడు 75శాతం పనులు పూర్తయ్యాయని చెప్పారు.పోర్టుకు రహదారి సౌకర్యం కల్పించలేని వైకాపా నేతలకు అభివృద్ధి గురించి మాట్లాడే హక్కు లేదని విమర్శించారు. ఉప్పు భూముల సేకరణ కోసం కనీసం దరఖాస్తు చేయలేకపోయారని అన్నారు. సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ఎన్నో ప్రయత్నాలు చేసి.. ప్రధాని, కేంద్ర మంత్రులను కలిసి 360 ఎకరాల ఉప్పుభూమిని 99 ఏళ్లకు లీజుకు తీసుకురావడంతో పనులు జరగడానికి అవకాశం ఏర్పడిందన్నారు. ఈ 22 నెలల్లో ఏం అభివృద్ధి జరిగిందో తెదేపా శ్రేణులు దీటుగా సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు. 2029 నాటికి టెక్కలి నియోజకవర్గం రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉండాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నట్లు చెప్పారు.

## ఏపీలో పలువురు ఐఏఎస్‌ల బదిలీ

మొదటి పేజీ తరువాయి

అమరావతి: ఏపీలో పలువురు ఐఏఎస్ అధికారులు బదిలీ అయ్యారు. ఏపీఈడీబీ సీఈవోగా షాన్‌మోహన్, ఏపీఐఐసీ ఎండీగా ఎ.ఎస్.దినేశ్‌కుమార్, గుంటూరు జిల్లా కలెక్టర్‌గా సాయికాంత్ వర్మ, విశాఖ కలెక్టర్‌గా అభిషిక్త్ కిశోర్, కాకినాడ జిల్లా కలెక్టర్‌గా ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, అల్లూరి జిల్లా కలెక్టర్‌గా టి.నిశాంతి, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌గా తమీమ్ అన్సారియాను ప్రభుత్వం నియమించింది.

## నిధుల కోసం మంత్రులు, సీఎం చుట్టూ తిరగాలా?:

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యేల నియోజకవర్గాలకు నిధులు ఇవ్వడం లేదని ఆక్షేపించారు. మంత్రుల నియోజకవర్గంలో మాత్రమే బిల్లులు వస్తున్నాయని, ప్రభుత్వం అంటే మంత్రులు మాత్రమే కాదని వ్యాఖ్యానించారు. నిధుల కోసం మంత్రులు, సీఎం చుట్టూ తిరగాలా? అని ప్రశ్నించారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నారని, ప్రభుత్వం ఏం చేసినా.. ఖమ్మం జిల్లాకే వెళ్తున్నాయన్న టాక్ ఉందని అన్నారు. సీఎం తన సొంతనియోజకవర్గం కొడంగల్‌ను అభివృద్ధి చేసుకున్నట్లు.. మునుగోడులో చేసుకోవాలని ఉండదా? అని నిలదీశారు. మధిర, హుజూర్‌నగర్ నియోజకవర్గాలకే లిఫ్టలన్నీ తరలిస్తున్నారని ఆరోపించారు. “ ప్రజలకు న్యాయం చేయకపోతే నేను ఈ పదవిలో ఉండటానికి అనర్హుడ్ని. రెండున్నరేళ్లుగా మనోవేదనతో రగిలిపోతున్నా. ఇప్పుడు అవకాశం వచ్చింది.. మాట్లాడుతున్నా. ప్రాంతాలు, నియోజకవర్గాలపై వివక్ష చూపొద్దు” అని రాజగోపాల్‌రెడ్డి హితవు పలికారు.

## అమరావతికి చట్టబద్ధత..

### అమిత్‌షాతో మాట్లాడిన వెంకయ్య నాయుడు

మొదటి పేజీ తరువాయి

కేంద్ర ప్రభుత్వం అందించిన సాయం గురించి ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. 2019 తర్వాత జరిగిన పరిణామాలు, ఎదురైన ఇబ్బందులను వివరించారు. భవిష్యత్తులో అలాంటి పరిస్థితులు ఎదురుకాకుండా కేంద్ర ప్రభుత్వం వెంటనే పార్లమెంటులో బిల్లు పెట్టి ఆమోదించాలని వెంకయ్య నాయుడు కోరారు. ఈ విషయంపై అమిత్ షా సానుకూలంగా స్పందించారు. తన మంత్రిత్వ శాఖ నుంచి అన్నీ క్లియర్ అయ్యాయని, క్యాబినెట్‌లో పెట్టి ఆమోదించడం ఒక్కటే మిగిలింది అని అమిత్ షా అన్నట్లు వెంకయ్య తెలిపారు.

## సీఎం తమ్ముడు, బావమరిదిపై విచారణకు సిద్ధమా?: హరీశ్‌రావు సవాల్

మొదటి పేజీ తరువాయి

పొంగులేటిని కాపాడేందుకు వంద అబద్ధాలు ఆడి రేవంత్‌రెడ్డి దొరికిపోయారు. ఏ పని కోసం నేనెప్పుడూ పొంగులేటికి ఫోన్ చేయలేదు. పొంగులేటి కంపెనీ అవినీతికి పాల్పడిందని అందరికీ అర్థమైంది. తప్పు జరిగిందని సీఎం, మంత్రి అసెంబ్లీలోనే ఒప్పుకొన్నారు. సీఎం, పొంగులేటి మధ్య లావాదేవీలు ఉంటాయి. వాళ్లు భూములను చెరిసగం పంచుకుంటారు. సభా సంఘం వేస్తే అన్నీ బయటకు వస్తాయని భయపడుతున్నారు. కోటి ఎకరాలు నిషేధిత జాబితాలో చేర్చి బేరం కుదిరితే తొలగిస్తున్నారు” అని హరీశ్‌రావు ఆరోపించారు.

## ఇంధన సంక్షోభం వేళ.. శ్రీలంకకు భారత్ సాయం

మొదటి పేజీ తరువాయి

కొలంబోలోని భారత రాయబార కార్యాలయం ఈ విషయాన్ని వెల్లడించింది. భారత ప్రధాని మోదీ, శ్రీలంక అధ్యక్షుడు అనూర కుమార దిసనాయకే ఇటీవల ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఈ నేపథ్యంలోనే భారత్ నుంచి ఆ దేశానికి సాయం అందింది. 20వేల మెట్రిక్ టన్నుల డీజిల్‌తో పాటు 18వేల మెట్రిక్ టన్నుల పెట్రోల్ తాజాగా కొలంబో నౌకాశ్రయానికి చేరుకున్నట్లు హైకమిషన్ పేర్కొంది. క్లిష్ట సమయంలో సాయం అందించినందుకు.. భారత్‌కు శ్రీలంక కృతజ్ఞతలు తెలిపింది. ఈ మేరకు అక్కడి ప్రతిపక్ష నాయకుడు సజిత్ ప్రేమదాస ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.

## ఎగ్జిట్ డోర్ తెరిచేందుకు ప్రయత్నించిన ఇండిగో ప్రయాణికుడు

ఇంటర్నెట్ డెస్క్: ఇండిగో విమానంలో ఓ అనూహ్య ఘటన చోటుచేసుకుంది. విమానం గాల్లో ఉండగా ఓ ప్రయాణికుడి వింత చేష్టలు తోటి ప్రయాణికులను కలవరపాటుకు గురిచేశాయి. ఎమర్జెన్సీ ఎగ్జిట్‌ను తెరిచేందుకు ప్రయత్నించడంతో ఆందోళన వాతావరణం నెలకొంది. దీంతో అతడిపై అధికారులు కేసు నమోదు చేశారు.

బెంగళూరు నుంచి వారణాసికి 6జు-185 ఇండిగో విమానం శనివారం బయలుదేరింది. టేకాఫ్ అయిన 15 నిమిషాలకే ఉత్తర్‌ప్రదేశ్‌కి చెందిన మహమ్మద్ అద్నాన్ అనే ప్రయాణికుడు వింతగా ప్రవర్తించడం ప్రారంభించాడు. విమానం గాల్లో ఉండగానే ఎమర్జెన్సీ డోర్‌ను తెరిచేందుకు ప్రయత్నించాడు. అప్రమత్తమైన విమాన సిబ్బంది అతడిని మందలించారు. అయినప్పటికీ ల్యాండింగ్‌కు కొన్ని నిమిషాల ముందు మరోసారి తన చేష్టలతో గందరగోళం సృష్టించాడు. విమానం 500 అడుగుల ఎత్తులో ఉండగా ఎమర్జెన్సీ ఎగ్జిట్‌ను మళ్లీ తెరిచేందుకు ప్రయత్నించాడు. సిబ్బంది పైలట్‌కు సమాచారం అందించారు. భద్రత చర్యల్లో భాగంగా పైలట్ ల్యాండింగ్ నిలిపివేసి విమానాన్ని గాల్లోనే తిప్పారు. అనంతరం సురక్షితంగా వారణాసిలో ల్యాండ్ చేశారు. దీంతో ప్రయాణికులంతా ఊపిరిపీల్చుకున్నారు. ఆ తర్వాత నిందితుడిని భద్రతా సిబ్బందికి అప్పగించారు. పోలీసులు అతడిపై కేసు నమోదు చేశారు. ఆ సమయంలో తాను ఎందుకు అలా చేశానో తెలీదని, దెయ్యం ఆవహించిందంటూ నిందితుడు చెప్పడం గమనార్హం.

# జిల్లాలో 1160 మంది లబ్ధిదారుల సామూహిక గృహ ప్రవేశాలు

**- జిల్లాలో ఇంతవరకు 82,443 గృహాల మంజూరు**
**- 46,249 మంది లబ్దిదారులకు గృహాలు అందజేశాం**
**- సామూహిక గృహ ప్రవేశాలలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి**



గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్

ఏలూరు జిల్లాలో సామూహిక గృహప్రవేశాలలో భాగంగా 1160 మంది పిఎంఎవై, ఎన్టీఆర్ గృహ లబ్ధిదారులతో సామూహిక గృహప్రవేశాలు చేసినట్లు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. ఉంగుటూరు మండలం అప్పారావుపేటలో సోమవారం పిఎంఏవై, ఎన్టీఆర్ గృహ సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజుతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో పిఎంఏవై, ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద 82 వేల 443 మంది పేదలకు ఇళ్ళు మంజూరు చేయడం జరిగిందని, వాటిలో ఇప్పటివరకు 45 వేల 089 ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయి లబ్ధిదారులకు అందించడం జరిగిందన్నారు. మరో 1160 ఇళ్ల లబ్దిదారులకు గృహాలను అందించడం జరిగిందన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో సోమవారం పండుగ వాతావరణంలో కార్యక్రమాలు నిర్వహించి లబ్దిదారులకు గృహాలను అందించడం జరిగిందన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో 123 ఇళ్ళు , దెందులూరులో నియోజకవర్గంలో 89, ఏలూరు లో 502, గోపాలపురంలో 12, కైకలూరులో 172, నూజివీడులో 119, పోలవరంలో 91, ఉంగుటూరు నియోజకవర్గంలో 52 ఇళ్ల నిర్మాణాలు పూర్తిఅయ్యాయయని, వాటిని లబ్దిదారులకు అందించడం జరిగిందన్నారు. ఉంగుటూరు శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ పేదరికమే అర్హతగా అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఎన్టీఆర్ గృహాన్ని మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో 5162 మంది లబ్దిదారులకు పిఎంఏవై, ఎన్టీఆర్ గృహాలను మంజూరు చేయడం జరిగిందని, వీరిలో 4195 మందికి గృహ నిర్మాణాలు పూర్తిచేసి అందించడం జరిగిందన్నారు. మిగిలిన ఇళ్ల నిర్మాణ పనులను త్వరలో పూర్తిచేసి లబ్ధిదారులకు అందించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా అప్పారావుపేటలోని గృహ లబ్ధిదారురాలు శ్రీమతి టి. నాగలక్ష్మి గృహప్రవేశంలో కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని మహిళా లబ్దిదారులకు గృహాల తాళాలను కలెక్టర్, ఎమ్మెల్యేలు అందించారు. అంతకుముందు గ్రామంలో పిఎం సూర్యఘర్ యోజన పథకం కింద లబ్ధిదారులు ఏర్పాటుచేసుకున్న సోలార్ యూనిట్ ను, ఉంగుటూరులో లో ఓల్టేజ్ సమస్య పరిష్కారానికి గాను ఏర్పాటుచేసిన ట్రాన్స్ఫార్మర్ ను జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే లు ప్రారంభించారు. కార్యక్రమంలో ఇంచార్జ్ ఆర్డీఓ దేవకీదేవి, గృహ నిర్మాణ శాఖ పీడి సత్యనారాయణ, ట్రాన్స్కో ఎస్ ఈ సాల్మన్ రాజు, ఈఈ అంబేద్కర్, తహసీల్దార్ పూర్ణ ప్రసాద్, ఎంపిపి ఘంటా శ్రీలక్ష్మి, ఎంపిడిఓ గంజి రాజ్ మనోజ్, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, తహసీల్దార్లు, రెవిన్యూ అధికారులు, పాల్గొన్నారు.

# ఏలూరు జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గం ఎన్నిక

**- ఘనంగా ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ ప్రథమ మహాసభ**
**- హాజరైన యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఆంజనేయులు.**
**- ఏపీ బీజేఏ అధ్యక్ష కార్యదర్శులుగా పి.నారాయణ, ఎం.కిరణ్.**

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్

ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ క్రాఫ్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ (ఏపీ బి జె ఏ) ఏలూరు జిల్లా మహాసభను ఏలూరులోని పంచాయతీరాజ్ మినిస్ట్రీయల్ ఉద్యోగుల సంఘం భవనంలో సోమవారం నాడు ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) ఏలూరు జిల్లా అధ్యక్ష కార్యదర్శు ఎస్.డి.జబీర్, వై.వి. హరీష్ అధ్యక్షతన మహాసభలు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు హాజరయ్యారు. ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని రాజ్యాంగంలో 4 వ స్థంభంగా పిలిచే మీడియా నేడు ముక్కలు అయిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. వర్కింగ్ జర్నలిస్ట్ చట్టాన్ని కేంద్ర రద్దుచేసిందన్నారు. జర్నలిస్టులను దిగజార్చడానికే నేషనల్ మీడియా కౌన్సిల్ ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఇందులో వర్కింగ్ జర్నలిస్టులకు ఎటువంటి ప్రాతినిధ్యం లేకుండా పోయిందన్నారు. ఆర్ ఎన్ ఐ ను మార్చివేసి పి ఆర్ జి ఐ ను ఏర్పాటు చేసిందని అన్నారు. “బలమైన, స్వతంత్ర విధానం లేకుండా ప్రజాస్వామ్యం సజావుగా నడపదని ఆయన ఆవేద వ్యక్తం చేశారు. ఏలూరు జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టు అందరూ ఎదుర్కొంటున్న



సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సీనియర్ నాయకులు బాలశౌరి, ఎక్రిడిటేషన్ కమిటీ సభ్యులు శంకర్రావు, కళ్యాణ్, మహా న్యూస్ స్టాఫ్ రిపోర్టర్ ఎం. భరత్, బి ఆర్ కే న్యూస్ స్టాఫ్ రిపోర్టర్ కే.బ్రహ్మం, 99 టీవీ స్టాఫ్ రిపోర్టర్ రాంబాబు, మెగా 9 టీవీ స్టాఫ్ రిపోర్టర్ చైతన్య, స్వతంత్ర టీవీ స్టాఫ్ రిపోర్టర్ సంజయ్, క్రైమ్ రిపోర్టర్ ఊర్ల శీను, ఏపీడబ్ల్యూజేఎఫ్ ఏలూరు జిల్లా యూనియన్ నాయకులు సోమశేఖర్ , ప్రతాప్, శరత్,జయరాం, సజ్జి మ్యాచెస్, దాస్, మిల్టన్ ప్రతాప్ ,సతీష్, చింతపల్లి శ్రీనివాస్, దొరబాబు, తదితరులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక. ఏలూరు జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గం ఎన్నికలు సోమవారం పంచాయతీరాజ్ మినిస్ట్రీయల్ ఉద్యోగుల సంఘం భవనంలో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో పెంట నారాయణ, ఎం. కిరణ్ ఏకగ్రీవంగా అధ్యక్ష కార్యదర్శులుగా ఎన్నుకున్నారు. పి.సుమన్, డి.సత్యనారాయణ ను ఉపాధ్యక్షులుగా, డి. దాస్ ను కోశాధికారి గా, భాషాను సహాయ కార్యదర్శిగా మరో 9 మందితో ఈసీ సభ్యులతో కూడిన కార్యవర్గాన్ని ఎన్నికున్నారు.

# పిజిఆర్ యస్ లోని దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

**- దరఖాస్తులు రీ ఓపెన్ కాకుండా నాణ్యమైన పరిష్కారం చూపాలి**
**- ధరఖాస్తులు పరిష్కారంలో అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు**
**- జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి**
**...**



గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్

ఎన్టీఆర్ గృహాల సామూహిక గృహప్రవేశాల కార్యక్రమం లో పాల్గొనేందుకు సోమవారం ఉంగుటూరు విచ్చేసిన జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఉంగుటూరు ఎంపిడిఓ కార్యాలయంలో ఉంగుటూరు శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు తో కలిసి ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజల నుండి విజ్ఞప్తులను స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ పిజిఆర్ఎస్ లో అందిన ప్రతీ విజ్ఞప్తిని వాటిలో తెలియజేసిన విషయాలపై క్షేత్రస్థాయిలో విచారణ చేసి, నిబంధనల మేరకు పరిష్కరించాలన్నారు. పిజిఆర్ యస్ లో అందిన ప్రతి అర్జీ రీఓపెన్ కాకుండా నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పిజిఆర్ యస్ లో అందిన దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నదని , కావున అధికారులు క్షేత్రస్థాయిలో ఉత్పన్నమయ్యే సమస్యలకు క్షేత్రస్థాయిలోనే పరిష్కారం చేసి అర్జీలు రీఓపెన్‌కు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. భూ సమస్యలు రెవిన్యూ క్లినిక్ ద్వారా పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఆర్డీఓ దేవకీదేవి, తహసీల్దార్ పూర్ణ ప్రసాద్, ఎంపిడిఓ గంజి రాజ్ మనోజ్, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, తహసీల్దార్లు, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

## వైసీపీ పోలవరం నియోజకవర్గ అబ్జర్వర్‌గా బీవీఆర్ చౌదరి

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్



వైసీపీ పోలవరం నియోజకవర్గ అబ్జర్వర్‌గా బీవీఆర్ చౌదరి ని పార్టీ అధిష్టానం నియమించింది. పోలవరం నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ మల్లేలా చంటి నాయుడు సోమవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీవీఆర్ చౌదరి తమ అపార అనుభవం, నాయకత్వ నైపుణ్యాలతో 2029 ఎన్నికల్లో నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు, ఇన్‌చార్జ్ తెల్లం బాలరాజు ఘన విజయం కోసం కృషి చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరిస్తూ, పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తారని పేర్కొన్నారు. ఈ సమావేశం స్నేహపూర్వక, ఆత్మీయ వాతావరణంలో కొనసాగిందని, పరస్పర అభిప్రాయాల పంచుకునే వేదికగా నిలిచిందని చంటి నాయుడు తెలిపారు.

## బిసిల సాధికారతకు చంద్రబాబు కట్టుబాటు డా. దశరథాచారి



శ్రీకాళహస్తి,మర్చి 30,గాయత్రి వార్తలు :రిపోర్టర్ : రంజిత్

బిసిల అభివృద్ధి, సంక్షేమం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కట్టుబడి పనిచేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమం మరియు అభివృద్ధి సంస్థ డైరెక్టర్ డా. జి. దశరథాచారి తెలిపారు. ఆర్థిక సవాళ్లు ఉన్నప్పటికీ బిసిల పురోగతికి ఆయన చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని కొనియాడారు. సోమవారం విజయవాడలోని బిసి భవన్‌లో నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో దశరథాచారి డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం శ్రీకాళహస్తి నియోజకవర్గానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గతంలో బిసిలకు ఉన్న రిజర్వేషన్లలో కోతల వల్ల అనేక అవకాశాలు కోల్పోయారని విమర్శించారు. ప్రస్తుతం ఎన్డీయే కూటమి ప్రభుత్వం బిసిలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే నిర్ణయం తీసుకోవడం ద్వారా వారి సాధికారతకు దోహదం చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఛైర్మన్ పార్వతి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు, మిన్నల్ రవి, రంగినేని చెంచయ్య నాయుడు, ఎం. సుబ్బయ్య, డా. ఉమేష్ రావు, బీమాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు బీఎస్ ఆర్ స్కాలర్ షిప్ లు

**- ఏలూరు ఎమ్మెల్యే రాధాకృష్ణయ్య చేతులమీదుగా అందజేత**




గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్

స్థానిక కొత్త బస్టాండ్ వద్ద మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ వారి ఆధ్వర్యంలో సి ఎస్ ఆర్ స్కాలర్షిప్ కార్యక్రమం లో భాగంగా పేద విద్యార్థులకు ముఖ్యఅతిథిగా హాజరైన ఏలూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఏలూరు నియోజకవర్గ శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సీఎస్ ఆర్ సంస్థ ఆధ్వర్యంలో చదువుల్లో రాణిస్తూ,పేదరికంలో ఉన్న కొంతమంది విద్యార్థులను గుర్తించారు. ఆ విద్యార్థులకు ఏలూరు ఎమ్మెల్యే రాధాకృష్ణయ్య చేతులమీదుగా చెక్కులను అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఉడా చైర్మన్ పెద్ది బోయిన శివప్రసాద్, ఇావీజ చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి , టిడిపి నగర మహిళా అధ్యక్షురాలు అరుణ కుమారి , ఏలూరు బ్రాంచ్ స్టోర్ హెడ్ జహీరుద్దీన్ షోరూమ్ మేనేజర్ ప్రేమ్ కుమార్, ఏలూరు స్టోర్ మేనేజర్ అమీరుద్దీన్,సిబ్బంది పాల్గొన్నారు.

## ఏప్రిల్ 1న జిల్లా వ్యాప్త నిరసనలను జయప్రదం చేయండి

**- ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు పిలుపు.**

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్



కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 1వ తేదీన జిల్లా వ్యాప్తంగా నిర్వహించే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు కార్మికులకు పిలుపునిచ్చారు. ?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ కొత్త లేబర్ కోడ్‌లు కార్మికులను కట్టుబానిసలుగా మార్చేలా ఉన్నాయని మండిపడ్డారు. దశాబ్దాల పోరాటాల ద్వారా సాధించుకున్న ఎనిమిది గంటల పనిదినం, కనీస వేతనం, సామాజిక భద్రత వంటి హక్కులను ఈ కోడ్‌లు కాలరాస్తున్నాయని విమర్శించారు. కార్మికుల శ్రమను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేసే ఈ చట్టాలను అమలు చేయడాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించబోమని ఆయన స్పష్టం చేశారు. ?కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న 4 లేబర్ కోడ్‌లను తక్షణమే ఉపసంహరించుకోవాలి. ?కార్మికుల పని గంటలను పెంచే ఆలోచనను విరమించుకోవాలి. ?గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేయాలని డిమాండ్ చేస్తూ ?ఏప్రిల్ 1న జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో, పారిశ్రామిక ప్రాంతాల్లో జరిగే నిరసనల్లో కార్మికులు, కార్మిక సంఘాల నేతలు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరిని నిరసించాలని కోనాల భీమారావు కోరారు.

# చెరువులు పరిరక్షణకు హై పవర్ కమిటీ ఏర్పాటు చేయాలి

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్



జి.ఓ.ఎం.ఎస్.నెం.188 సుప్రీంకోర్టు తీర్పు తర్వాత పంచాయితీ ప్రభుత్వ భూములను జిల్లా గెజిట్లో పొందుపరచాలని,2025లో హైకోర్టు తీర్పును అనుసరించి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన 9 మంది సభ్యులతో కూడిన హై పవర్ కమిటీని పంచాయతీ ఆస్తులను కాపాడటానికి తక్షణమే ఏర్పాటుచేసి జిల్లాలోని చెరువులు ఇతర ప్రభుత్వ భూములను ఆక్రమణల నుండి తొలగించడానికి చర్యలు చేపట్టాలని సోమవారం ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు వారణాసి శ్రీహరి, ప్రధాన కార్యదర్శి చుక్క చందర్రావు, పాలక రంజిత్ కుమార్, తూముల ప్రభాకర్ రావు మరియు బాలు కలసి జెసి గారికి రెవెన్యూ క్లినిక్ లో ఫిర్యాదు చేయడం జరిగింది . సుప్రీం కోర్టు ఆదేశాలను, హైకోర్టు తీర్పులను గౌరవించి తక్షణమే జిల్లాలోని చెరువుల పరిరక్షణకు చర్యలు చేపడతారని సమితి సభ్యులు విజ్ఞప్తి చేశారు.

# స్మశాన వాటిక రోడ్లు పరిశీలించిన ఎమ్మెల్యే రోషన్ కుమార్

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్



లింగపాలెం లో స్మశాన వాటికకు వెళ్లే రహదారిని చింతలపూడి ఎమ్మెల్యే రోషన్ కుమార్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు రోడ్డు నిర్మాణం యొక్క ఆవశ్యకతను ఎమ్మెల్యేకి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోషన్ కుమార్ మాట్లాడుతూ త్వరలోనే రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు వినియోగంలోనికి తీసుకొస్తామని హామీ ఇచ్చారు.

# పీజిఆర్ ఎస్ విజ్ఞప్తులను సమయంలోగా పరిష్కరించాలి

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్



పీజీ ఆర్ ఎస్ ద్వారా అందిన విజ్ఞప్తులను నిర్దేశించిన సమయంలోగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ అధికారులను ఆదేశించారు. ఏలూరు జిల్లా కలెక్టరేట్ లోని గోదావరి సమావేశపు హాలులో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా జేసీ అభిషేక్ గౌడ మాట్లాడుతూ పీజిఆర్ ఎస్ ద్వారా అందిన విజ్ఞప్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించాలన్నారు. పీజిఆర్ ఎస్ ద్వారా అందిన విజ్ఞప్తులు రీఓపెన్ కాకుండా పరిష్కరించాలన్నారు. సోమవారం పీజిఆర్ ఎస్ లో 289 విజ్ఞప్తులు అందాయి.కార్యక్రమంలో ఇంచార్జ్ డిఆర్ఓ భాస్కర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఏపీడబ్ల్యూజేఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

**– ముఖ్య అతిథిగా హాజరైన ఏలూరు ఎమ్మెల్యే రాధాకృష్ణయ్య**



గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్

ఇండోర్ స్టేడియం జిల్లా పరిషత్ కాంప్లెక్స్ షాపుల పైన 4వ తరగతి క్లాస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ భవనంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ వారి నూతన కమిటీ ఎన్నిక జరిగింది.అనంతరం జరిగిన ప్రమాణ స్వీకార మహోత్సవానికి ముఖ్య అతిథులుగా ఏలూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఏలూరు నియోజకవర్గ శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షులు ఎస్డి జబీర్, ప్రధాన కార్యదర్శి వై వి హరీష్, ఎలక్ట్రానిక్ మీడియా నూతన అధ్యక్షుడు పి నారాయణ, కార్యదర్శి కిరణ్ కుమార్, కమిటీ సభ్యులు శంకర్రావు, కళ్యాణ్, సీనియర్ పాత్రికేయులు బాలశౌరి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మావోయిస్ట్ పార్టీ కీలక నేత లొంగుబాటు

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్



మావోయిస్ట్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు చెల్లూరి నారాయణరావు అలియాస్ సురేష్ ఏపీ డీజీపీ ముందు లొంగిపోయారు.నారాయణరావు సహా మొత్తం తొమ్మిది మంది నక్సల్స్ లొంగుబాటు జరిగిందని సమాచారం.నారాయణరావు టీమ్ లొంగుబాటు ఘటనతో ఆంధ్రప్రదేశ్ నక్సల్స్ రహిత రాష్ట్రంగా మారినట్లు ఏపీ డీజీపీ వెల్లడించినట్లు ప్రకటన విడుదల చేశారు.

# విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

**– ప్రభుత్వ సంక్షేమ వసతి గృహం విద్యార్థులకు సూచించిన జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి**

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్



ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి హితబోధ చేశారు. ఉంగుటూరు మండలం కైకరంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, అక్కడ సౌకర్యాలు, విద్యార్థుల విద్య అభ్యాసన స్థాయిలను పరిశీలించారు. ఈ సందర్భంగా వసతి గృహంలో దోమల నియంత్రణ నెట్ లను ధ్వంసం చేసినట్లు గుర్తించి, వివరాలను వసతి గృహం వార్డెన్ ని అడిగి తెలుసుకున్నారు. వసతిగృహంలోని విద్యార్థులే దోమల నియంత్రణ నెట్ లను ధ్వంసం చేసారని తెలియజేయడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ వసతి గృహంలో దోమలు ఎక్కువగా ఉండడంతో విద్యార్థులు విషజ్వరాల బారిన పడకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ వసతి గృహంలోనూ దోమల నియంత్రణ నెట్ లను ఏర్పాటుచేసిందన్నారు. కొందరు ఆకతాయిల కారణంగా నెట్ లు పాడైపోయాయని, దీని కారణంగా దోమలు ప్రబలి మలేరియా, డెంగ్యూ వంటి విష జ్వరాలు ప్రబలుతాయన్నారు. వసతిగృహంలో సిసి కెమెరాలు ఏర్పాటుచేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. , వసతిగృహం పరిసరాలలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా నిఘా పెట్టాలని పోలీసు అధికారులను కలెక్టర్ ఆదేశించారు.విద్యార్థుల ప్రవర్తన నియంత్రణలో ఉండేలా, ఆకతాయి ధోరణి మార్చుకునేలా కౌన్సిలింగ్ ఇవ్వాలని వసతి గృహం వార్డెన్ ను కలెక్టర్ ఆదేశించారు. భోజనం మెనూ ప్రకారమే అందించాలన్నారు. టాయిలెట్లు, వసతి గృహం పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు.బాలికల వసతి గృహంలో సమస్యలను వెంటనే పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్ అనంతరం ఉంగుటూరు లోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని కలెక్టర్ పరిశీలించారు. అక్కడ విద్యార్థినుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. మెనూ, సౌకర్యాలు , భోజనం నాణ్యతను గురించి అడిగి తెలుసుకున్నారు. టాయిలెట్లు, వసతిగృహం పరిసరాలలో పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థినిల ఆహారానికి అవసరమైన కూరగాయలను ప్రకృతి సాగుద్వారా వసతిగృహం ఆవరణలో పెంచే విధంగా (కిచెన్ గార్డెన్స్) చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వసతిగృహం వార్డెన్ ను ఆదేశించారు. ఇంచార్జ్ ఆర్డీఓ దేవకీదేవి, తహసీల్దార్ పూర్ణ ప్రసాద్, ఎంపిడిఓ గంజి రాజ్ మనోజ్, ,సహాయక సాంఘిక సంక్షేమ శాఖాధికారి నాగసాయి, వార్డెన్ గణపతి తదితరులు పాల్గొన్నారు.

# పేదల అభివృద్ధికే పి4 పథకం సీబీఎన్ విజన్‌కు ప్రతిబింబం: బొజ్జల సుధీర్ రెడ్డి

శ్రీకాళహస్తి,మర్చి 30,గాయత్రి వార్తలు :రిపోర్టర్ : రంజిత్

శ్రీకాళహస్తి పట్టణంలోని స్థానిక పురపాలక శాఖ కార్యాలయంలో నిర్వహించిన పి4 కార్యక్రమాన్ని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న పి4 (పబ్లిక్--ప్రైవేట్--పీపుల్ పార్ట్‌నర్‌షిప్) పథకం ప్రజలకు విస్తృత ప్రయోజనాలు అందిస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి గల నాయకుడిగా రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు.“సీబీఎన్ అంటే నమ్మకం... క్రమశిక్షణ... విజనరీ... అభివృద్ధి... ఆంధ్రప్రదేశ్” అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ వయస్సులో కూడా యువకుడిలా పనిచేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని పేర్కొన్నారు.చంద్రబాబు విజన్‌కు కార్యరూపమే పి4 పథకమని, పేదవాడిని ఆర్థికంగా బలపడే స్థాయికి తీసుకెళ్లడమే దీని లక్ష్యమని స్పష్టం చేశారు. పేదల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే ఈ పథకం అసలు ఉద్దేశమని తెలిపారు.శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పలు కంపెనీలు పి4 పథకానికి సహకారం అందిస్తున్నాయని, ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్న ప్రజలకు తోడ్పాటు అందించిన సంస్థలను అభినందించారు.గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ, టిట్కో గృహాల నిర్మాణాన్ని మధ్యలోనే నిలిపివేశారని ఆరోపించారు. పూర్తికి



చేరువలో ఉన్న పనులను ఆపివేసి, గృహాలకు భారీ వ్యయంతో కేవలం రంగులు వేయడానికే పరిమితమయ్యారని విమర్శించారు.అభివృద్ధి అంటే ఏమిటో తెలియని నాయకత్వం గతంలో ఉందని, ప్రస్తుతం మాత్రం సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లగల నాయకుడు చంద్రబాబు నాయుడేనని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# గ్రామాల వారీగా ఉచిత వైద్య సేవలు ప్రజల ఆరోగ్యానికి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కృషి

శ్రీకాళహస్తి,మర్చి 30,గాయత్రి వార్తలు :రిపోర్టర్ : రంజిత్

శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు జూ= నిధులతో గ్రీన్ ప్యానెల్ సంస్థ గ్రామాల వారీగా ఉచిత వైద్య సేవలు అందిస్తోంది. కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల తొట్టంబేడు మండలంలోని గ్రామాలను సందర్శిస్తూ ప్రజలకు ఉచిత మెడికల్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన ప్రాథమిక ఔషధాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.ఎమ్మెల్యే స్వయంగా కార్యక్రమం పురోగతిని సమీక్షిస్తూ, అమలుపై పర్యవేక్షణ చేస్తూ తగిన సూచనలు ఇస్తున్నారు. ఆయన మార్గదర్శకత్వంలో



గ్రీన్ ప్యానెల్ బృందం గ్రామాల్లో ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, చిన్నచిన్న అనారోగ్య సమస్యలకు అక్కడికక్కడే చికిత్స అందిస్తోంది.గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సేవల ద్వారా ప్రజలు ఖర్చు లేకుండా ప్రాథమిక వైద్యం పొందుతున్నారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి గ్రీన్ ప్యానెల్ సంస్థ చేస్తున్న సేవలను అభినందిస్తూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలకు తన పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.

# ఎమ్మెల్యేకు గండిగూడెం గ్రామపెద్దల వినతి

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్

పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజును గండిగూడెం గ్రామ పెద్దలైన కొరివి శేషారావు, పింగుల మధు కలిశారు.గండిగూడెం అభివృద్ధికి చర్యలు చేపట్టాలని వినతి పత్రం అందజేశారు.టీ నర్సాపురం పంచాయతీ పరిధిలోని గండిగూడెం గ్రామ పెద్ద కొరివి శేషారావు, పింగుల మధు సోమవారం పోలవరం శాసనసభ్యులు చిర్రీ బాలరాజు గారిని బర్రింకలపాడు లోని ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పోలవరం నియోజకవర్గ అభివృద్ధి ప్రదాతగా నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేలా అహర్నిశలు శ్రమిస్తున్నారని బాలరాజుకి కృతజ్ఞతలు తెలిపామన్నారు, అదేవిధంగా గండిగూడెం ప్రధాన రహదారి అభివృద్ధికి పంచాయతీరాజ్ అధికారులు రూ.2 కోట్ల రూపాయలు అంచనా వ్యయం పై అధికారులకు నివేదిక పంపారని నిధులు మంజూరు అయ్యేలా, అసంపూర్తిగా నిలిచిపోయిన అంగన్వాడి పాఠశాల పూర్తిస్థాయిలో నిర్మించాలని దీనికై ఎమ్మెల్యే కృషి చేయాలని కోరారు. దీంతోపాటు గండిగూడెంలో డ్రైనేజీ వ్యవస్థ కూడా అస్తవ్యస్తంగా ఉందని డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధికి నిధులు మంజూరు చేయించాలని కోరారు. అలాగే కొరివి రామన్నపాలెం రోడ్ల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కోరారు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని తమతో చాలాసేపు ముట్టడించారని టి. నర్సాపురం మండల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఆ దిశగా చర్యలు చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని చెప్పారు.టీ నర్సాపురం మండల జనసేన సీనియర్ నాయకులు పోలవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జట్ల



సత్యనారాయణ సమన్వయకర్త గా వ్యవహరించారు.

**GAYATHRI VARTHALU Publisher, Editor and Owned by Maddineni Nageswara Rao,** SVN Colony, Guntur, Andhra Pradesh - 522006. PRGI Reg No - APTEL/25/A1201 .. Cell No - 7386045673 ..... Printed At SUNDAY PRINTING PRESS, SVN Colony, Guntur, Andhra Pradesh - 522006 ..Cell No - 7386045673.